సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



మక్కల కొనుగోలుకు సన్నాహాలు

మరో రెండు మూడు రోజుల్లో మక్కల కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 50 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

6లో



చివరి గింజా కొంటాం

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు.

7లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 11 మంది కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదే విధంగా 8 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు చేసినట్లు తెలిపారు.

రైతుకు తీపి కబురెప్పుడు?

- చెరకు రైతులకు రూ.14.20 కోట్ల బకాయి
- క్రషింగ్ ముగిసి మూడు నెలలు కావొస్తున్నా చెల్లింపుల్లో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న రైతాంగం
- చర్యలు చేపట్టిన అధికారులు



ట్రైడెంట్ చక్కెర కర్మాగారం

జహీరాబాద్: చెరకు బకాయి కోసం రైతాంగం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తోంది. జహీరాబాద్‌లోని ట్రైడెంట్ యాజమాన్యం బకాయి చెల్లించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- క్రషింగ్ ముగిసి మూడు నెలలు కావస్తున్నా బిల్లుల చెల్లింపు విషయంలో జాప్యం చేస్తోందని ఆరోపిస్తున్నారు.
- రైతాంగానికి రూ.14.20 లక్షల మేర బకాయి పడింది. కర్మాగారంలో 2022–23 క్రషింగ్‌కు 2.55 లక్షల టన్నుల చెరకును గానుగాడించింది.
- టన్నుకు రూ.3,270 ధర నిర్ణయించింది. మొదటి విడత కింద టన్నుకు రూ.3 వేల వంతున చెల్లిస్తూ వచ్చింది. మిగతా రూ.270 పెండింగ్ పెట్టింది.
- జనవరి, ఫిబ్రవరిలో చెరకును సరఫరా చేసిన రైతులకు పూర్తి స్థాయిలో బిల్లులు బకాయి పడింది. జోన్ పరిధిలో ఉన్న మొత్తం 2,287 మంది రైతులు కర్మాగారానికి చెరకును సరఫరా చేశారు.
- ఇందులో 1,699 మంది రైతులకు టన్నుకు రూ.270 వంతున, మిగిలిన 588 మంది పూర్తి స్థాయిలో బిల్లులు బకాయి పడింది.
- రూ.83 కోట్లకు గాను రైతాంగానికి ఇప్పటి వరకు రూ.64కోట్లు చెల్లించింది. ఇంకా రూ.14.20 కోట్ల మేర బకాయి చెల్లించాల్సి ఉంది. బకాయి పడిన బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించేందుకు ఒత్తిడి

- రైతులకు చెల్లించాల్సిన చెరకు బకాయి ఇప్పించేందుకు అధికార యంత్రాంగం ట్రైడెంట్ యాజమాన్యంపై ఒత్తిడి తెస్తోంది.
- డిప్యూటీ కమిషనర్ స్థాయిలో యాజమాన్యంతో చర్చలు జరిపి బకాయిలను చెల్లించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది.
- ప్రస్తుతం చక్కెర, మొలాసిస్ నిల్వలు ఉన్నాయని, వాటిని ఎగుమతి చేసి బకాయిలను చెల్లించనున్నట్లు యాజమాన్యం హామీ ఇచ్చినట్లు సమాచారం.
- ఈనెల 25వ తేదీన కలెక్టర్ యాజమాన్యంతో చర్చలు జరిపి, వెంటనే బిల్లులు చెల్లించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఐదారు రోజుల్లో సగం మేర బిల్లులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు యాజమాన్యం చెప్పినట్లు సమాచారం.

రూ.12 లక్షలు రావాల్సి ఉంది

నాకు ట్రైడెంట్ యాజమాన్యం ఇంకా రూ.12లక్షల మేర బకాయి పడింది. వీటిని చెల్లించాలని ఇప్పటికే యాజమాన్యాన్ని కోరాను. 30 ఎకరాల్లో చెరకు పంట వేశా. సుమారు రూ.1,700 టన్నుల మేర చెరకును కర్మాగారానికి సరఫరా చేశా. పంట సాగు కోసం అప్పులు చేశాను. చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోతోంది. మొత్తం బకాయి చెల్లించేలా అధికారులు చొరవ తీసుకోవాలి.

– పెంటారెడ్డి, రైతు, బూర్దిపాడ్

త్వరగా చెల్లించేలా చర్యలు



రైతులకు చెరకు బకాయి పూర్తిస్థాయిలో చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నాం. ఇప్పటికే అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు చేపట్టాం. వారంలో సగం బిల్లులు చెల్లించేందుకు సుముఖత తెలిపింది. మిగతా సగం బిల్లులను మరో పక్షం రోజుల్లో చెల్లించేందుకు హామి ఇచ్చింది. బిల్లుల విషయంలో రైతులు ఏ మాత్రం ఆందోళన చెందొద్దు. మొత్తం బిల్లులు చెల్లించేలా ప్రయత్నిస్తున్నాం.

– రాజశేఖర్, కేన్ అసిస్టెంట్ కమిషనర్–సంగారెడ్డి

న్యూస్‌రీల్

పీఎం ఎస్‌బీవై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: పీఎం ఎస్‌బీవై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నరేశ్ కుమార్ సూచించారు. నారాయణఖేడ్ సహకార బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం ఖాతాదారులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకు వివిధ పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. సహకార బ్యాంకు అన్ని రకాల రుణాలు, బంగారు తాకట్టు రుణాలు అందజేస్తుందన్నారు. అలాగే లాకర్ల సౌకర్యం ఉందన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి నాగేందర్, శోభారాణి, అశోక్‌రెడ్డి, సీసీ వెంకట్, సర్పంచ్ విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే రెసిడెన్షియల్ ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పోటీ పరీక్షలకు ఫౌండేషన్ కోర్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు సంబంధించి వందమందికి అవకాశం ఉంటుందని, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మే 14 లోగాను mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడి మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్

సంగారెడ్డి మున్సిపాలిటీ: టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సుశీల్ బాబు గుండెపోటుతో ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న మంత్రి హరీశ్‌రావు సంతాపం ప్రకటించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. తెలంగాణ ఉద్యమంలో చేసిన సేవలను కొనియాడారు. సుశీల్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కలెక్టర్ శరత్, హ్యాండ్లూమ్ చైర్మన్ చింతా ప్రభాకర్, అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివశంకర్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్

కొండాపూర్(సంగారెడ్డి): సీబీఎస్‌ఈ నియమ నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దుచేయాలని ప్రగతి శీల విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలోని సీబీఎస్‌ఈ రీజినల్ కార్యాలయంలో అధికారి మీనాజోషికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, బీరంగూడలోని కొన్ని పాఠశాలలు సీబీఎస్‌ఈ నిబంధనలు పాటించకుండా చట్టవిరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. అటువంటి పాఠశాలల గుర్తింపు రద్దు చేసి, నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సాహిత్, సురేశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



మీనాజోషికి వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి


అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి టౌన్: కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు, డిజిటల్ కాంటాలు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత మార్కెటింగ్ అధికారికి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, సహకార, ఎస్‌డబ్ల్యూసీ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలుకు 9 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 5,890 ఎకరాల్లో మొక్కజొన్న, 2,974 ఎకరాల్లో జొన్న, 269 ఎకరాల్లో పొద్దుతిరుగుడు సాగైందని, ఆయా పంటల ద్వారా సుమారు 68,559 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చే అవకాశముందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోళ్లు జరపాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.1,962, జొన్న రూ.2,970 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఫైనలైజ్ చేసి రవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఆయా ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. శనగలు అమ్మని వారు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు అమ్ముకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ అధికారి శ్రీదేవి, వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, జిల్లా సహకార అధికారి తుమ్మ ప్రసాద్, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజర్ బజార్, మార్కెటింగ్ శాఖ ప్రతినిధి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి

జోగిపేట(అందోల్): ఆటల పోటీల్లో క్రీడాకారులు గెలుపు, ఓటమిని సమానంగా తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జోగిపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో మున్సిపల్ కౌన్సిలర్ నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. తనకు క్రీడలంటే చాలా ఇష్టమని, చిన్నతనంలో క్రీడల్లో పాల్గొని ఎన్నో విజయాలు సాధించినట్లు గుర్తు చేశారు. క్రీడల అభివృద్ధికి తనవంత సహకారం వ్యక్తిగతంగా ఎప్పుడూ ఉంటుందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతీ గ్రామంలో క్రీడాప్రాంగణాలను ప్రభుత్వం నిర్మించిందన్నారు. క్రీడాకారులను తయారు చేయడానికి తప్పనిసరిగా పీఈటీలు అవసరమని అన్నారు. పోటీలకు పీఈటీ మహేశ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కాగా పోటీల్లో 40 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకుడు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, మున్సిఫ్ కోర్టు ఏజీపీ హరినారాయణ వర్మ, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, భవానీ, రేఖ, కౌన్సిలర్ దుర్గేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎం.మల్లికార్జున్, మాజీ ఎంపీపీ హెచ్.రామాగౌడ్, మాజీ కౌన్సిలర్ ప్రదీప్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పిట్ల లక్ష్మణ్, నాగరత్నంగౌడ్, ఖలీల్, మాజీ వార్డు సభ్యుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

నేడు ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష

కొండాపూర్(సంగారెడ్డి): మహాత్మ జ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల కళాశాలలో ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ ప్రభాకర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసిన 12 పరీక్ష కేంద్రాల్లో 2786, మెదక్ జిల్లాలో తొమ్మిది కేంద్రాలలో 2035 మంది, సిద్దిపేట జిల్లాలో 7 కేంద్రాలలో 1530 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్‌లను ౦ జ్బిఇ// ర్ఘ్జిఖిభీట్బజీట్బ్బ ౕఇజ్బ్చ. జౌఠి. జీఠ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సెల్ ఫోన్‌లు, క్యాలిక్‌లేటర్, ఎలక్ట్రికల్ వాచీలు అనుమతించమన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



నర్సాపూర్: జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్/వర్గల్: ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాపంగా శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వర్గల్ నవోదయలో అడ్మిషన్ కోసం ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 5,691 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 5,054 మంది పరీక్షకు హాజరయ్యారని వర్గల్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ జి.రమేశ్‌రావు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మే 9న సదరం శిబిరం

సంగారెడ్డి మున్సిపాలిటీ: మే 9న మంగళవారం సదరం శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి తెలిపారు. మే 2 నుంచి స్లాట్స్ కేటాయిస్తామని, అభ్యర్థులు మీసేవ ద్వారా స్లాట్స్ బుక్ చేసుకుని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపునకు హాజరుకావాలని పేర్కొన్నారు.

సాక్షి విద్యార్థులకు వేసవి శిబిరం

'సాక్షి' మీడియా గ్రూప్, సినాప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తోంది. పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్, క్లే మోడలింగ్, క్రాఫ్ట్స్, ఫొటో ఫ్రేం వర్క్స్, యోగా, రోల్‌ప్లే డ్రామా అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు.

వేదిక: synapse, International school, రైతుబజార్ ఎదురుగా, రాజీవ్‌పార్క్ దగ్గర, సంగారెడ్డి.

తేదీ: మే 1 నుంచి వారం రోజులు

సమయం: ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

గమనిక: పేర్లు నమోదుకు 8008847012, 9908322511 నంబర్లలో సంప్రదించాలి

వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి కృషి



కాశీపూర్‌లో బసవ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్ రావు

ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

కంది(సంగారెడ్డి): వీరశైవ లింగాయత్‌ల సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం కంది మండలంలోని కాశీపూర్‌లో బసవ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాయత్‌ల గౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకువెళ్లింది సీఎం కేసీఆర్ అన్నారు. లింగాయత్ సమాజానికి తెలంగాణ ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పించిందన్నారు. బసవేశ్వరుడు చూపిన మార్గంలో నడవాలన్నారు. కులరహిత సమాజం కోసం 12వ శతాబ్దంలోనే కృషి చేశారన్నారు. లింగాయత్‌ల ఆత్మగౌరవ భవనాల కోసం హైదరాబాద్‌లోని కోకాపేటలో రూ.30 కోట్ల విలువ కలిగిన ఎకరా భూమి ఇవ్వడంతోపాటు రూ.10 కోట్లతో భవనం నిర్మించనున్నట్లు వెల్లడించారు. బసవేశ్వరుడి పేరిట ఉమ్మడి మెదక్ జిల్లాలో బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చేపట్టడం జరిగిందన్నారు. అందోల్ నియోజకవర్గ కేంద్రంలో బసవ భవన్ ఏర్పాటుకు ఎకరం స్థలం ఇవ్వాలని అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే క్రాంతికిరణ్, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, టీఎస్‌ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా డబుల్ బెడ్రూం ఇళ్లు

ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సదాశివపేట(సంగారెడ్డి): అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశామని, మిగిలిన వారికి దశలవారీగా మంజూరు చేస్తామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని సిద్దాపూర్ గ్రామ శివారులో నిర్మించిన 500 లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను అందజేశారు. మొదట 8వ బ్లాక్‌లోని 101 నంబర్ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారుడికి పట్టా సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్‌కుమార్, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ నగేశ్, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, మున్సిపల్ చైర్మన్ పిల్లోడి జయమ్మ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు, పులిమామిడిరాజు, ఆకుల శివకుమార్, చౌదరి ప్రకాశ్, పిల్లోడి విశ్వనాథం, రవి, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్ రూమ్ ఇంటి పట్టా సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ఆమోదం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి అధ్యక్షతన శనివారం తెల్లాపూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లులను మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.3.16 కోట్లు చెల్లింపునకు ఆమోదం తెలిపారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్ ఎండీ రూ.70 లక్షలు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఇందుకు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకరించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని నీటి బిల్లులకు సంబంధించిన మీటర్లు వినియోగదారులే స్వయంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.



నీటి బిల్లులకు సంబంధించిన పత్రాన్ని అధికారులకు అందిస్తున్న చైర్‌పర్సన్ లలిత

కుంభమేళాలో మహా గంగాహారతి

- పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు
- ఉత్సవాలకు హాజరైన మంత్రి హరీశ్‌రావు



నృత్యం చేస్తున్న మహిళలు



గంగమ్మకు మహా మంగళహారతి ఇస్తున్న మంత్రి హరీశ్ రావు తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): కుంభమేళకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో మంజీరా నదీ కోలాహలంగా మారింది. రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులో కొనసాగుతున్న కుంభమేళకు ఆరోరోజు భక్తుల తాకిడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీర నదిలో పుణ్యస్నానాలు చేశారు. కుటుంబ సమేతంగా గంగామాతకు పూజలు నిర్వహించారు. అనంతరం గంగాదేవిని దర్శించుకున్నారు. ఆలయం ఆవరణలో ఉన్న శివలింగానికి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో యజ్ఞాలు, హోమాలు కొనసాగుతున్నాయి. భక్తులు దిగంబర సాధువులను ఆశీస్సులు తీసుకున్నారు. సాయంత్రం సాధువులు ప్రదర్శించిన విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు పంచవటిలో కొలువైన శారదా దేవి, సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, శనీశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంత్రి హరీశ్‌రావు పూజలు

పంచవటికి చేరుకున్న మంత్రి హరీశ్‌రావు మంజీర నది వద్ద గంగాదేవికి పూజలు చేసి మహామంగళహారతి ఇచ్చారు. అక్కడ నుంచి పంచవటి వెళ్లి శారదాదేవికి పూజలు నిర్వహించారు. ఆయన వెంకట జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, జహీరాబాద్, నారాయణఖేడ్ శాసన సభ్యులు మాణిక్‌రావు, భూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, కలెక్టర్ డాక్టర్ శరత్, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు. మల్లయ్యస్వామి, గణపతి మహారాజ్, కాశీనాథ్‌బాబా భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

క్లుప్తంగా

భార్యతో గొడవపడి..


కృష్ణ(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడి ఓ భర్త అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...మండల పరిధిలోని కట్టపోచారం గణపతిగూడేనికి చెందిన కృష్ణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 28వ తేదీన భార్య సునీతతో గొడవ పడి ఉదయం పదిగంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఫోన్ చేసి చూడగా స్విచ్చాఫ్ వచ్చింది. కుటుంబసభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తండ్రి దుర్గయ్య ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో మహిళ మృతి


శిల్పన (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): గుండెపోటుతో ఓ మహిళ మృతి చెందింది. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీరుడు చెన్నయ్య–శిల్పన(22) దంపతులు. వీరిద్దరూ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఒక్కసారిగా శిల్పన అస్వస్థతకు లోనైంది. చికిత్స నిమిత్తం మెదక్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. శిల్పనకు రెండేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకూతురు ప్రియాంక కాగా, చిన్న కూతురు వయసు నెలన్నరలోపే. శిల్పన అకాల మృతిని కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వం ద్వారా పిల్లలను ఆదుకునేందుకు తమవంతు సహకారం అందిస్తామని గ్రామ సర్పంచ్ సువర్ణ, ఇతర నాయకులు తెలిపారు.

మక్కల కొనుగోలుకు సన్నాహాలు

ఉమ్మడి జిల్లాలో సాగు (ఎకరాల్లో)	37,000
దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నులు)	83,000
ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు	50

సాక్షి, సిద్దిపేట: మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ఊరటే. మక్కల కొనుగోలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 37,920 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, 83వేల మెట్రిక్ టన్నుల మక్కలు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందు కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మరో రెండు మూడు రోజుల్లో కొనుగోళ్లు కూడా ప్రారంభించనున్నారు.

నాణ్యత పేరుతో ప్రైవేట్ వ్యాపారుల ఇబ్బందులు

మక్కల నాణ్యత సరిగ్గా లేదంటూ ప్రైవేట్ వ్యాపారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. వానల కారణంగా దెబ్బతిన్న పంటలతో నష్టపోయిన రైతులకు వ్యాపారులు ధర తక్కువగా చెల్లిస్తున్నారు. దీంతో రైతులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలోనే మక్క రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1,962 చొప్పున చెల్లించి కొనుగోలు చేయనున్నారు.


సిద్దిపేట మార్కెట్ యార్డులో ఆరబోసిన మక్కలను చూస్తున్న మహిళా రైతు (ఫైల్)

- సిద్దిపేట జిల్లాలో 17వేల ఎకరాలు, సంగారెడ్డిలో 12,500, మెదక్‌లో 8,420 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఒక్కో ఎకరానికి సుమారుగా 22 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 83వేల మెట్రిక్ టన్నుల మక్కల దిగుబడి వస్తుంది.
- సిద్దిపేటలో 25, మెదక్‌లో 16, సంగారెడ్డిలో 9 కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం

రెండు రోజుల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ 1,962ను క్వింటాల్‌కు చెల్లిస్తాం. రైతుల బ్యాంక్ అకౌంట్‌లోకి మక్కల డబ్బులు నేరుగా జమ చేస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీదేవి, మార్క్‌ఫెడ్ డీఎం, సంగారెడ్డి

సిద్దిపేటలో...

మల్లంపల్లి, అక్కన్నపేట, పోతారం(జే),కట్కూర్(అక్కన్నపేట), బెజ్జంకి మండలంలో వెల్దుర్, బెజ్జంకి, చేర్యాల, చిన్నకోడూరు. దుబ్బాక, గజ్వేల్, మీర్జాపూర్, గాంధీనగర్, మహ్మదాపూర్, హుస్నాబాద్, కోహెడ, మిరుదొడ్డి, చెప్యాల్, నంగనూరు, దౌల్తాబాద్, గట్లమల్యాల, పాలమాకుల, ఇర్కోడ్, బుస్సాపూర్, సిద్దిపేట, తొగుట.

మెదక్‌లో...

తూప్రాన్, కల్వకుంట, నిజాంపేట్, రామాయంపేట, బచ్చురాజుపల్లి, పాత్రియల్, రాయాలపూర్, ముస్లాపూర్, నర్సాపూర్, శంకరంపల్లి, చేగుంట, శివ్వంపేట, వాడి(మెదక్), హవేళిఘన్‌పూర్, చిన్నఘన్‌పూర్, వెల్దుర్తి.

సంగారెడ్డిలో...

బొక్కాస్‌గావ్, క్రిష్ణపూర్, ఇప్పపల్లి, సదాశివపేట్, ఝరాసంగం, పీచరగడీ, నిజాంపేట, ఎడాకుపల్లి, వరంలలో కేంద్రాలు ఏర్పాటు చేయన్నారు.

బోరంచ నల్లపోచమ్మకు బంగారు ముక్కు పుడుక


బోరంచనల్లపోచమ్మకు బంగారు ముక్కుపుడుకను అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మనూరు(నారాయణఖేడ్): బోరంచ నల్లపోచమ్మ అమ్మవారికి మంత్రి హరీశ్‌రావు బంగారు ముక్కు పుడుక బహూకరించారు. శనివారం మంత్రికి ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, పూజారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి బంగారు ముక్కుపుడుకను అలంకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులు త్వరగా పూర్తి అయ్యి నారాయణఖేడ్ ప్రాంతం సస్యశ్యామలం కావాలని ఆకాంక్షించారు. ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి,నేతలు రవీందర్‌నాయక్, విఠల్‌రావు, మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాములు, సర్పంచ్ రేణుక పండరి పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలు బంద్

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా నిలిచిన వరద నీరు


లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీటిని తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సు అండర్ బ్రిడ్జి కింద వరదలో నిలిచిపోయింది. మధ్యాహ్నం బస్సును అక్కడ నుంచి తొలగించారు. మసీద్‌బండ మీదుగా వచ్చే వరద గోపీచెరువు, చాకలి చెరువు మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి చేరడంతో భారీగా నీరు నిలిచింది. జీహెచ్ఎంసీ ఏఈ సునీల్ సిబ్బంది వరద నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. భెల్ చౌరస్తా నుంచి తారానగర్ మీదుగా వచ్చే వాహనాలను నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు ఇబ్బందుల పాలయ్యారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత రాకపోకలు ప్రారంభమయ్యాయి. స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పర్యటించారు.

ఆలిండ్ ఎంప్లాయిస్ ప్రధాన రోడ్డులో వరద...

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆలిండ్ ఎంప్లాయిస్ కాలనీ ప్రధాన రోడ్డులో వరద నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం 9 గంటలకు వరద నీరు వెళ్లడంతో రాకపోకలకు మార్గం సుగమం అయింది.

సమాజ సేవలోనే తృప్తి


మాచవరం సర్పంచ్ మాధవి

మెదక్‌జోన్: మెదక్ మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన కోటపాటి మాధవి 2019లో సర్పంచ్‌గా భారీ మెజార్టీతో గెలుపొందారు. తను సంపాదించిన దాంట్లో కొంత సమాజ సేవ కోసం ఖర్చు చేయాలనేది ఆమె తపన. మాధవి భర్త శ్రీనివాస్ చౌదరి సిద్దార్థ పాఠశాలల యజమాని. కాగా మాచవరంలో పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో సర్పంచ్ సొంత డబ్బు ఖర్చు చేసి పంచాయతీ భవనం నిర్మించింది. అందులో ఫర్నిచర్‌కు రూ. 50 వేలు, ప్రహరీ నిర్మాణానికి మరో రూ. 3 లక్షలు ఖర్చు పెట్టి నిర్మాణాలు పూర్తి చేయించింది. అంతే కాకుండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు రూ. 1.50 లక్షలు ఖర్చు పెట్టి డ్యూయల్ డెస్క్‌లు అందజేసింది. మరో రూ. 5 లక్షలు ఖర్చు చేసి గ్రామం చుట్టూ నాలుగు బస్టాండ్లను నిర్మించింది. సంపాదనలో కొంత సమాజ సేవ కోసం ఉపయోగిస్తే అది ఎంతో తృప్తిని ఇస్తుందని ఈసందర్భంగా ఆమె పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాల్లో మాచవరం సర్పంచ్ మాధవి


సర్పంచ్ మాధవి సొంత నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

జీవితంపై విరక్తి చెంది...

జహీరాబాద్: జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. మండలపరిధిలోని రంజోల్ గ్రామానికి చెందిన చాకలి నర్సమ్మ(60) భర్త మూడు సంవత్సరాల క్రితం మరణించాడు. ఆమెకు సంతానం లేదు. మంచీచెడు చూసేవారు ఎవరూ లేరు. గ్రామస్తులతో తరచు చనిపోవాలని ఉందని చెబుతుండేది. ఈనెల 23వ తేదీన ఆమె అదృశ్యమైంది. శనివారం శనివారం ఆర్ఎల్ఆర్ పాఠశాల సమీపంలో ఉన్న బావిలో శవమై తేలగా కనుగొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో...

నంగునూరు(సిద్దిపేట): అప్పుల బాధతో భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ రాజుగౌడ్ కథనం ప్రకారం ..మండలపరిధిలోని కొండంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బండి బాలకొమురయ్య (45) వ్యవసాయం, కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సంవత్సరం కిందట కూతురి వివాహం చేశాడు. ఈ క్రమంలోనే అప్పులు పెరిగాయి. బాకీలుతీర్చే మార్గం లేక మనస్తాపం చెందిన కొమురయ్య శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. శనివారం ఉదయం అతని కోసం వెతకగా, పొలానికి వెళ్లే దారిలో పురుగుల మందు తాగి మృతి చెందినట్టు గుర్తించారు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కొమురయ్య

సెల్‌ఫోన్ల అందజేత

దుబ్బాక: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను 24 గంటల్లోనే గుర్తించి పోలీసులు బాధితుడికి అందజేశారు. ఎస్ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మాపూర్‌కు చెందిన నవీన్ సెల్‌ఫోన్ పోయిందంటూ దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తి అందులో తన సిమ్ వేయగా, పోలీసులకు ఆ వివరాలు తెలిశాయి.

బేగంపేటలో..

రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన గడ్డం రాజు ఫోన్ పోగొట్టుకోగా, గుర్తించారు. ఎస్ఐ అరుణ్ బాధితుడి అందజేశారు.


సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ మహేందర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని టీటీసీ భవన సమీపంలోని ఒడిసెల కుంటలో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయిన విషయం స్థానికుల ద్వారా పోలీసులకు తెలిసింది. అక్కడకు చేరుకున్న వారు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని ఆచూకీ కోసం వెతకగా, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుని వయస్సు 35 సంవత్సరాల పైన ఉంటుందని, చామన ఛాయ రంగు కలిగి గులాబీ కలర్ షర్ట్, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించినట్టు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు త్రీటౌన్ సీఐ నెంబర్ 9812667317, ఎస్ఐ నెంబర్ 9712582022కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ మహిళా క్రీడాకారిణులను వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మెదక్ జిల్లా బాల్ బాడ్మింటన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య డిమాండ్ చేశారు. శనివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ మహిళా క్రీడాకారిణులను వేధించిన బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానుల నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతు ఇస్తున్నామన్నారు.

బేస్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండల కేంద్రంలో బేస్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని పీఈటీ గోవర్ధన్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ రాజార్షి షా, యువజన క్రీడల అధికారి నాగరాజుల ఆదేశాల మేరకు ఐటీసీ పరిశ్రమ వద్దగల క్రీడా ప్రాంగణంలో క్యాంప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. మే 1వ తేదీ నుంచి ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిబిరం పనిచేస్తుందన్నారు. కాగా చేగుంట మండలం చందాయిపేట ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న తనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

కంచన్‌పల్లిలో కార్డన్ సెర్చ్

15బైక్‌లు, ఆటో, బొలేరో ట్రాలీ వాహనం సీజ్


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ షేక్‌లాల్ మదార్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని కంచన్‌పల్లి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శనివారం సాయంత్రం నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మదార్ ఆధ్వర్యంలో కౌడిపల్లి ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి, పోలీసుల బృందం గ్రామంలో ఇంటింటికి తిరిగి సోదాలు చేశారు. 41 ఇళ్లను తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 15బైక్‌లు, ఒక ఆటోతోపాటు, బొలేరో ట్రాలీ వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ షేక్‌లాల్ మదార్ మాట్లాడుతూ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ చేసి ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు తీసుకొస్తే తిరిగి ఇస్తామన్నారు.

వాగులో పడి...

మనూరు(నారాయణఖేడ్): ప్రమాదవశాత్తు వాగులో పడి ఒకరు మృతి చెందారు. ఎస్ఐ లక్ష్మణ్ కథనం ప్రకారం..వట్‌పల్లి మండలం పాలడుగు గ్రామానికి చెందిన దేవునూరి శంకర్(48)రామచంద్రాపురంలో నివాసం ఉంటున్నాడు. సొంతూరికి వెళుతున్నానని భార్య శోభకు చెప్పి ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. మనూరు మండలం ఉసిరికెపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై వాగు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి నీటిలో పడి చనిపోయాడు. ఈ విషయం శనివారం వెలుగుచూసింది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం...కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన గంగిశెట్టి పెంటయ్య(65) శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాజీవ్‌రహదారిపై బస్టాండ్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఫార్మసీ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన


కళాశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న ప్రతినిధులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచ గ్రామ శివారులోని రంగనాయకసాగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న రంగనాయక స్వామి బీ ఫార్మసీ కళాశాల నిర్మాణ పనులను ఎగ్జిబిషన్ సొసైటీ, ఉస్మానియా యూనివర్సిటీ ఫార్మసీ డిపార్ట్ మెంట్ ప్రతినిధులు శనివారం పరిశీలించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు అనుమతి కోసం పంపే ప్రతిపాదనలకు అనుగుణంగా జరుగుతున్న పనులను, తరగతి గదులు, ల్యాబ్‌లు, కళాశాల నిర్మాణ విధానాలను పరిశీలించారు. ఎగ్జిబిషన్ సొసైటీ సౌజన్యంతో రూ.10 కోట్లతో కళాశాల నిర్మాణం జరుగుతోంది. 6 ఎకరాల విస్తీర్ణంలో ఐదు అంతస్తులతో భవనం నిర్మాణ పనులు చేపట్టారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 60 సీట్లతో బీ ఫార్మసీ తరగతులు ప్రారంభించేలా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ముహూర్తం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ రుక్మిణి సత్యభామ సహిత శ్రీ వేణు గోపాల స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు వేద పండితులు శనివారం ముహూర్తం ఖరారు చేశారు. పట్టణంలోని జె.పి కాలనీలో ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమ పత్రికను రాయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ మే 9 నుంచి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 13న దివ్య ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహ చారి, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధు, మారబోయిన రాజు యాదవ్, మాజీ జెడ్పీటీసీ మాణిక్యం, మాజీ కార్పొరేటర్లు సపానదేవ్, శంకర్ యాదవ్, హరేరామ, హరే కృష్ణ బృందం, పట్టణ పురప్రముఖులు, పెద్దలు పాల్గొన్నారు.

డీఎస్ఓ విచారణ


దిడిగిలో విచారణ జరుపుతున్న డీఎస్ఓ

జహీరాబాద్: మండలంలోని దిడిగి గ్రామ రేషన్ డీలర్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి డీఎస్ఓ వనజ విచారణ జరిపారు. గ్రామ ప్రజలకు సక్రమంగా రేషన్ సరుకులు సరఫరా చేయడం లేదని, అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె విచారణ జరిపారు. ఈ సందర్భంగా పలువురి అభిప్రాయాలు సేకరించారు. ప్రజలకు ఏ మేరకు బియ్యం సరఫరా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు.

మియాపూర్ మెట్రో నుంచి పుష్పక్ బస్సులు

మియాపూర్: మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు పుష్పక్ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. శనివారం మియాపూర్ మెట్రో వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ యాదగిరి, చీఫ్‌మార్కెటింగ్ అధికారి రిషి కుమార్, ఎల్‌అండ్‌టీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరేంద్రనాథ్ తదితరులు పాల్గొని పుష్పక్ కేంద్రాన్ని ప్రారంభించారు. మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 24 గంటల పాటు పుష్పక్ బస్సులు రాకపోకలు సాగిస్తాయని ఈడీ యాదగి రి తెలిపారు. ఉదయం 6:30 నుంచి రాత్రి 10:30 వరకు 20 నిమిషాల వ్యవధిలో నడుస్తాయి. అలాగే రాత్రి 11:10 నిమిషాలకు నుంచి ఉదయం 6:10 వరకు 40 నిమిషాలకు ఒక బస్సు చొప్పున అందుబాటులో ఉంటుంది.మియాపూర్ మెట్రో స్టేషన్, జేఎన్టీయూ నుంచి విమానాశ్రయం వరకు చార్జీలు రూ. 300 ఉంటుంది. అలాగే శిల్పారామం, గచ్చిబౌలి నుంచి టిక్కెట్ రూ. 250 ఉంటుంది. గూగుల్‌పే.పేటీఎం, ఫోన్‌పే వంటి సదుపాయం కూడా ఉందని, ప్రయాణికులు నగదురహిత సేవలను కూడా వినియోగించుకోవచ్చునని ఆయన చెప్పారు.ఎయిర్‌పోర్టు ప్రయాణికులు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద పుష్పక్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు